భూతం

ఆమె అటకమీదనుంచి క్రిందకు చూసింది!

నేలనిండా దుమ్ము పేరుకుపోయి ఉంది. గోడలు మాసిపోయి ఉన్నాయి. మాసినగోడలమీద సాలెపురుగులు తమాషాగా పాకుతూ కదుల్తున్నాయి.

గదినిండా ముతకవాసన!

మూసివున్న కిటికీతలుపుల సందుల్లోంచి సన్నని వెలుగు గదిలోకివస్తోంది.

మళ్ళీ పగలయింది!

ఇంకా ఇలాటి పగళ్లు మూడు, రాత్రులు మూడు ఇంకా గడవాలి!

అపుడు, తాను కోరుకున్న క్షణాలు వస్తాయి!

ఆమె అటకమీదనుంచి క్రిందకు దుమికింది!

మెల్లగా తలుపుసందుల్లోంచి ప్రక్క గదిలోకి వెళ్ళింది. అదే పడకగది!

ఆ గదిలో మంచంమీద పాతపరుపు ఒక్కటేవుంది. కొత్తపరుపు, దుప్పట్లు ఏవీలేవు. గదిలో బట్టలస్టేండు బోసిగా వుంది.

తూర్పు గోడకున్న 'వార్డ్‌రోబ్' తలుపులు బోర్లా తెరిచి ఉన్నాయి. వాటి అరల్లో పాతపేపర్లు, చిరిగిపోయిన చందమామ పుస్తకాలుతప్ప వస్తువులు ఏవీలేవు. బొద్దింకలు గోడ కంతల్లోంచి బయటకువచ్చి అరల్లో ఇటూఅటూ పాకుతున్నాయి.

గోడకు బిగించిఉన్న ట్యూబ్‌లైటు చుట్టూ ఏవోపేరు తెలియని పురుగులు చిన్నచిన్న గూళ్ళుకట్టేయి.

మూసివున్న కిటికీ దగ్గరలోనే పెద్ద టేబిలువుంది! దానికిఆన్చి నిలువుటద్దం ఉంది. టేబిలుమీద పాతగుడ్డ, జోళ్లు తుడిచే బ్రష్ అస్తవ్యస్తంగాపడివున్నాయి.

ఒక బల్లి టేబిలుమీదకు పాకివచ్చి పురుగుల్ని పట్టి తింటోంది.

అద్దంముందు ఖాళీఅయిపోయినబొట్టు సీసా పడివుంది.

ఆమె అద్దం ఎదురుగా నిలబడింది!

అద్దంలో ఆమెకు తన ప్రతిబింబం కనిపించలేదు!

ఆమెకు ఏడుపువచ్చింది!

అంతలోనే కోపంవచ్చింది!

వెంటనే ఆవేశంకూడా వచ్చింది!

ఇంకా మూడురోజులు గడవాలి.

ద్విభాష్యం రాజేశ్వరరావు

అంతవరకూ ఓపిక పట్టాలి. ఆ తరువాత తానుచేయబోయేపని తలుచుకుంటే సంబరం వేసింది,

ఆమె మెల్లగా మంచంవద్దకు వెళ్ళి పాతపరుపుమీద కూలబడింది.

మంచం నాలుగు మూలలూ ఆప్యాయంగా తడిమింది. తలవైపునవున్న పాత తలగడవైపు ప్రేమతో చూసింది.

ఆమంచాన్ని వదల్లేకపోతోంది ఆమె!

సరిగ్గా, పదహారునెలలక్రితం ఒక నాటిరాత్రి ఈ పరుపుమీదే జీవితంలోని మొదటి తీపి అనుభవాన్ని రుచిచూసింది ఆమె! ఆ తీపి అనుభవంతోపాటు తాను కోల్పోయిన శీలంవిలువ అమూల్యమని కొద్దిరోజుల తరువాతే ఆమెకు తెలిసింది. ఆసంఘటన ఎంతమరచిపోదామనుకున్నా మరుపుకు రావటంలేదు.

పదహారు నెలలక్రితం ఆ రాత్రి—

తొమ్మిది గంటలవేళకు అంటుగిన్నెలుతోమి పంటింట్లో బోర్లించింది. తరువాత పెరటితలుపులు బిగించి వచ్చింది. గ్లాసుతో మంచినీళ్ళుతెచ్చి పడకగదిలో వుంచి "బాబుగారూ! నేను వెళ్తున్నా! వీధి తలుపులు వేసుకోండి!" అంది అతనితో.

అతడు చదువుతున్న పుస్తకంమూసి "అంత అర్జెంటుగా వెళ్ళాలా? ఇంకో గంట ఆలస్యంగావెళ్తే కొంపలంటుకుంటాయా?" అన్నాడు నవ్వుతూ.

ఆలస్యమైనా ఫర్వాలేదు. పనివుంటే చెప్పండి!" అంది మామూలుగానే. అతడు మెల్లగా మంచందిగి వచ్చేడు.

"చూడు! అమ్మగారు, పిల్లలు యీవేళ వూరువెళ్ళేరుకదా! రేపు సాయంకాలందాకా రారు. అందుకని ఇంట్లో అవసరాలన్నీ నువ్వేచూడాలి." అన్నాడు.

"అలాగే బాబూ! అమ్మగారుకూడా చెప్పేరు. రేపు ఉదయం ఆరోగంటకల్లా వచ్చేస్తా. మీ కాఫీ, వంట అన్నీ నేనే చేస్తాను. ఆఫీసుకి ఆలస్యంకాకుండా కేరియరు కట్టిస్తాను." అంది.

అతడు నవ్వుతూ "అంతేనా? మరి మిగిలిన పనుల్లో? అన్నాడు.

ఆమె అతనివంక అనుమానంగా చూసింది. అతనివంటిమీదనుండి మత్తయిన సెంటువాసన తెరలావచ్చి ఆమెను కమ్మింది. అతడు చనువుగా దగ్గరకు వచ్చి ఆమెచెయ్యిపట్టుకున్నాడు. గాజులు గలగలమన్నాయి.

ఆమె మనసు రెపరెపలాడింది!

యవ్వనంలోకి ప్రవేశించేక మొట్టమొదటి పురుషస్పర్శ అది.

ఆమె భయంతో వణికిపోయింది.

అతనితో పెనుగులాడాలనుకుంది.

గట్టిగా గొంతెత్తి అరవాలని కూడా అనుకుంది.

అతణ్ణి బలంగా దూరానికి నెట్టివేయాలని అనుకుంది.

కానీ, ఏమీచేయలేకపోయింది.

అతడు ఆమెను పూర్తిగాఆక్రమించుకున్నాడు రెండునిమిషాల్లోనే!!

"అమ్మగారు చిలకలా వుంటారు కదా! నామీద మోజెందుకు బాబూ!" అని అడిగింది అరగంట తరవాత మంచం మీదనుండి లేస్తూ.

అతడు చిరునవ్వుతో "చిలకల్లో చాలా రకాలుంటాయి. ఒక్కో చిలకది ఒక్కో అందం!" అన్నాడు.

తరువాతిరోజునే అమ్మగారు, పిల్లలు వూరినుండి తిరిగివచ్చేశారు.

అతడు ఆమెను మరిచిపోయాడు.

అమ్మగారూ, అతడూ పడకగదిలోకి వెళ్తూవుంటే చాలారోజులవరకూ అసూయగా వుండేది ఆమెకు.

దినాలు గడుస్తున్నకొద్దీ ఆ అనుభవాన్ని మరిచిపోవాలనుకుంద. అయితే, తను అనుభవించిన ఆనందం యొక్క ఫలితం తనలో ఏర్పడుతోందని ఆమెకు ఆలస్యంగా తెలిసింది. ఆ సంగతి తెలి

సేక ఆమెకు ఆ రాత్రి నిద్రపట్టలేదు! ఒడలంతా చెమటలు కమ్మేయి.

గుండె భయంతో అవిసిపోయింది!

మరునాడు రహస్యంగా అతనితో అసలు విషయం చెప్పేసింది.

"కొంప ముంచేవ్!" అన్నాడు అతడు బెదిరిపోతూ. ఆ మాట అన్నప్పుడు అతని ముఖంలోని భయాన్ని స్పష్టంగా చదవగలిగింది.

ఆమెకు ఏం మాట్లాడాలో తోచలేదు!

కొంప ముంచింది అతడే! పైగా తన మీదకు తప్పు తోసేస్తున్నాడు.

"సాయంకాలం మాత్రలు తెచ్చి పెరటిగూట్లో పెడతాను. వేసుకో!" అన్నాడు. అలాగేనన్నట్లు మౌనంగా తలవూపింది.

ఓ సాయంకాలం కనుచీకటి పడేవేళ పెరట్లో తారాడుతూ గొణుగుతున్నట్లు అడిగేడు అతడు "ఏమయింది?" అని.

"ఏమీ అవలేదు!" అంది.

"సరేలే!" అంటూ కాలుకాలిన పిల్లిలా వెళ్ళిపోయేడు.

'సరేలే' అంటే అతని నిర్ణయం ఏమిటో ఆమెకు అర్థంకాలేదు. కాని అదే రాత్రి ఎనిమిది గంటలవేళ బెడ్‌రూంలో టేబిలు ఫేను అమర్చి ప్లెగ్ పెడుతూ వుంటే కొంత అర్థమయింది. పూర్తిగా అర్థం చేసుకునే లోగానే ఏదో బలమయిన శక్తి ఆమెను తోసేసింది. వెనుకనుండి కర్రతో అదిమిపెట్టి కరెంటుషాక్ తో అతడే చంపేశాడని ఆమెకు అర్థమయింది.

ఆమె చచ్చిపోయింది!!

ప్రమాదవశాత్తూ కరెంటుషాకు తగిలి చనిపోయిందని అతడు అందరికీ చెప్పేడు. మంచిపని మనిషి చనిపోయిందని ఇంట్లో అందరూ కన్నీళ్ళు పెట్టుకున్నారు. అతడూ కన్నీళ్ళు కార్చేడు!

చనిపోయిన నక్షత్రం మంచిది కాదు కనుక ఏడాదిపాటు ఇంటిని పాడు పెట్టాలన్నారు. ఇంటిలో సామాన్లన్నీ వేరే అద్దె ఇంటిలోకి మార్చి ఈ ఇంటికి తాళాలువేసి వెళ్ళిపోయారు.

అప్పటినుండీ, ఆమెఇక్కడే గడుపుతోంది. ఆమెకు ఆకలిలేదు! నిద్రలేదు! దాహం అంతకంటె లేదు! ఒకే ఒక కోరిక మాత్రం వుంది.

అన్యాయంగా తనను హతమర్చినందుకు అతన్ని, ఆ సంసారాన్ని పట్టుకు పీడించాలని! వాళ్ళను అనుక్షణం హింసించాలి!

అతడూ, అతని భార్యా చాలా అన్యోన్యంగా వుండేవారు. పిల్లలిద్దరూ కూడా బొద్దుగా ఆరోగ్యంగా ముత్యాల్లా వుండేవారు. చక్కని కుటుంబం వాళ్ళది. తనతో సాంగత్యం, తరువాత తనకు చేసిన అన్యాయం తప్ప అతడిలో చెడ్డ గుణాలు లేవు! దురలవాట్లు కూడా ఏవీ లేవు! తనతో సాంగత్యంవున్నా, భార్యను మాత్రం ప్రాణంలాగే చూసుకునేవాడు. అతడిని బాధించాలంటే అతని భార్యా పిల్లల్ని హింసించాలి. వాళ్ళనిపట్టి పీడించాలి! రకరకాలుగా వాళ్ళని బాధ పెట్టాలి!

అపుడు అతనిలో కలిగే దుఃఖం చూస్తే కసితీరుతుంది! అతడిని చంపటం ఆమె ధ్యేయం కాదు! ఆ కుటుంబాన్ని పీడించటమే ధ్యేయం!

ఆమె కోరిక తీరటానికి ఇంకామూడు దినాలు గడువుంది.

ఈ మూడు దినాలలో ఈ ఇంట్లోకి వచ్చేస్తారు అతడూ. భార్యా. పిల్లలూ!

అపుడు తన పథకం ప్రారంభించాలనుకుంది ఆమె.

మంచం దిగిమళ్ళీ ముందు గదిలోకి వచ్చింది.

ఒక్క ఉదుటున ఎగిరి అటక ఎక్కింది.

అటక మీద ఒకమూల కూలబడింది మళ్ళీ క్షణాలు లెఖ్ఖపెడుతూ!!

* * *

మూడు దినాలు గడిచి పోయాయి.

నాలుగో దినం ఉదయం భళ్ళున ఆఇంటి తలుపులు తెరుచుకున్నాయి.

ఒక్కసారి గాలీ, వెలుతురూ లోనికి చొరబడితే ఉక్కిరి బిక్కిరి అయిపోయింది ఆమె.

అటక మీద ఒకమూలకు వెళ్ళినక్కి కూర్చుంది!

గది తలుపులన్నీ తెరుచుకున్నాయి.

కిటికీ తలుపులు తెరిచేసరికి ఇంట్లోకి వెల్తురుతో బాటు ఎండ కూడా వచ్చేసింది!

ఇంటినిండా హడావుడి! ఇల్లంతా తుడిచేసి! నీళ్ళతో కడిగేరు!

ముగ్గులు పెట్టేరు! గదిలో హోమం పెట్టేరు. మంత్రాలు చదివేరు బిగ్గరగా పూజలూ, పునస్కారాలు చేసేర్ను.

తంతులన్నీ ముగించేక భోజనాలు పెట్టేరు.

పగలంతా హడావుడిగా జరిగింది!

వెలుతురు తట్టుకోలేక ఆమె అటక దిగిరాలేదు. అదీకాక ముగ్గులూ, పూజలూ చూస్తే ఆమెకు క్రిందికి దిగి రావటానికి కూడా భయం కల్గింది. సాయంకాలం చీకటిపడే సమయంలో అటక చివరకు వచ్చి మెల్లగా చూసింది. పిల్లలిద్దరూ బొద్దుగా తయారయ్యేరు. గనగునలాడుతూ ఇంట్లోచలాకీగా తిరుగుతున్నారు. అతడూ, అతనిభార్యా మాత్రం కొంచెం సన్నబడినట్లు అనిపించింది. అతని భార్యముఖంలో మునపటి చలాకీ తనం లేదు. కాంతితో వెలిగిపోయే ఆమె కళ్ళు వెల వెల బోతున్నట్లు అనిపించింది. అతడు మనిషి బిక్కినా, ముఖం మాత్రం ముగ్గలతో లావెక్కింది. ఇంతకు ముందు లేని చిన్న బొజ్జ వేరుగా కనిపిస్తోంది మనిషిలో మునపటి దృఢత్వం లేదు. అతడి కళ్ళ క్రింద నల్లని చారలు ఏర్పడ్డాయి. ఈ ఒక్క సంవత్సరంలోను అయిదు సంవత్సరాల వయసును మిగిన వానిలా అతడు కనబడ్డాడు.

ఆ రాత్రి అలికిడి ముగిసేదాకా అటక దిగిరాలేదు ఆమె!

తరువాత మెల్లగాదిగి పిల్లంగదిలోకి వెళ్ళింది. వాళ్ళిద్దరూ నిద్రపోతున్నారు తరువాత అతడి గదిలోకి వచ్చింది. అతడిగదిలో కొత్తమంచంమీద కొత్త

పరుపువేసి మంచి దుప్పటి పరిచిప్పి... గది స్వరూపమే మారిపోయినట్లనిపించింది. అంతా అమర్చినట్లు చక్కగా తయారయివుంది. దుమ్ము పేరుకుపోయి నిన్నటిపరకూ చెత్తగావున్న నేల ఇపుడు తళతళా మెరిసిపోతోంది.

అతడు కుర్చీలోకూర్చుని వున్నాడు!

అతడి ఎదురుగావున్న టీపాయ్‌మీద గ్లాసు, సీసా వున్నాయి! సీసాలో ద్రవం తళతళలాడుతోంది. ఇది అతడికి కొత్త అలవాటు అనుకుంది ఆమె! దగ్గరలోనే అతడి భార్య నిలబడివుంది. కనులు నిండిన నీళ్ళతో! ఆమె క్షణంసేపు భార్యాభర్తలవంక చూస్తూ వుండిపోయింది.

"ఏమండీ! మీకు పుణ్యంవుంటుంది. నామాట వినండి. ఈ పదకొండు నెలల్లోనూ మీరు ఎంత మారిపోయారో మీకు తెలియడంలేదు. ఆరోగ్యం పూర్తిగా నాశనం కాకముందే దీన్ని మానండి!" అంటూ అభ్యర్థిస్తోంది భార్య.

"మొదలెట్టావా మళ్ళీ! ఫో! ఇక్కణ్ణుంచి! రోజూ వెధవసోద! నేను తాగుతాను! నువ్వు అరచి గింజుకున్నా మానను! నాఇష్టం! నాడబ్బు! నేను తాగుతాను!" అతడి మాటలు ముద్దగా వున్నాయి.

అతడికళ్ళు చింతనిప్పుల్లావున్నాయి. అతడి ముఖం మనిషిరక్తం రుచి ఋటాను పులుముఖంలోవుంది. అతడి జుత్తు చెదిరిపోయి అస్తవ్యస్తంగావుంది.

"ఏమండీ! మీకిది న్యాయంకాదు! ఇది మొదలుపెట్టిననాడే మీకు చెప్పేన్లు! అలవాటయితే మానలేరని! మొదటిరోజు పార్టీలో బలవంతంవల్ల తాగేనన్నారు. తరువాత స్నేహితులకోసంతాగేనన్నారు. తరువాత కంపెనీకోసం తాగేరు. తరువాత్తరవాత పార్టీలు పోయాయి, స్నేహితులు పోయారు. కంపెనీ, ఒంటి నెప్పులు అన్నీపోయాయి. పోయినంత ఆస్తీపోయింది! ఆరోగ్యమూపోయింది! ఇంకా ఎందుకండీ ఈ అలవాటు? దయచేసి నాకోసం మానెయ్యండి. ఈ అలవాటుతో మీరు బంధువులమధ్య స్నేహితులమధ్య ఎంత చులకన అయిపోతున్నారో గుర్తించేరా? ఏనాడూ చేయిచాచి ఒక్కరూపాయికూడా ఎవరిదగ్గరా అప్పు చెయ్యనిమీరు, నెలాఖరురోజుల్లో విస్కీ సీసాలకోసం అప్పుతెస్తున్నారు. క్రితంవారంలో మీరు తీసికెళ్ళిన చేబదులు తిరిగి ఇవ్వమని పక్కింటాయన వాళ్ళ అబ్బాయిని మన ఇంటికి కబురంపితే నేను సిగ్గుతో ఎలా కుచించుకుపోయానో మీకు తెలీదు. మీరు గదిలో సీసా, గ్లాసుతో కూర్చుంటే గదివంక చూడడానికే వణికిపోతున్నారు పిల్లలు. వాళ్ళకీ మీకు మధ్య పెద్ద అగాధం ఏర్పడిపోతోంది. మీరొక్కదినం కేంపువెళ్తే

…శం గట్టుకుపోయే పిల్లలు ఇప్పుడు మిమ్మల్ని చూస్తేనే జడుసుకుంటున్నారు. ఎందుకని? మీకు చికాకు ఎక్కువయిపోయింది. కోపంఎక్కువయిపోయింది. తాగుడుతప్ప ఇంక దేనిమీదా మీకు ఆసక్తిలేదు! ఇంట్లోవచ్చిన మార్పులన్నిటికీ మీ తాగుడే కారణం! ప్లీజ్! నేను కోరుకునేది ఈ ఒక్కటే! ఈవ్యసనం మానెయ్యండీ! మీరుమునపటిమనిషి అవండి! అంతే!" అతడిభార్య కంటి నుండి ఏకధారగావర్షిస్తున్నాయి కన్నీళ్లు!

అతడు నోటివద్ద ఉంచుకోబోయిన గ్లాసును ఆమెవైపు క్రూరంగాచూసి ఆమె ముఖంమీదికి విసిరేడు. అది ఆమె ముఖానికి బలంగాతగిలి నేలమీద పెద్దశబ్దంతో పడి భళ్ళున బ్రద్దలయింది!

"నాకు నీతులు చెప్పకు! నువ్వూ, పిల్లలూ కట్టకట్టుకుని గోదాట్లో దిగండి! నేను మాత్రం తాగుడు మానను కాక మానను. అర్థమయిందా? నీమూలాన కొత్తగళాసు పగిలిపోయింది. మరోటి పట్రా!" ముద్దగా సాగదీస్తూ అన్నాడు.

భార్య అక్కడనుండి కదల్లేదు, ఏడుస్తూ నిలబడిపోయింది.

"నీకే! తీసుకురమ్మంటే వినపడటం లేదా? అహ!...వినపట్టంలేదా అని..." అంటూ కుర్చీలోంచి తూలుతూ లేచివచ్చి భార్య వీపువంపి గట్టిగా రెండు చరుపులు చరిచేడు.

నోటిలో చీరకొంగుకుక్కుకుని ఏడుస్తూనేలమీద కూలబడిపోయింది భార్య.

గోడ ఆసరాగా మెల్లగా తడుముకుంటూ వంటగదిలోకివెళ్ళి మరోగ్లాసు తెచ్చుకున్నాడు అతను.

సీసాలోని ద్రవం గ్లాసులోకి, గ్లాసులోనుండి అతడి పెదవులమధ్యకు వెళ్ళిపోయింది.

భర్త అరుపులకూ, భార్యరోదనకూ పిల్లలిద్దరూ లేచిపోయారు.

భయంగా అడుగువేసుకుంటూ గది తలుపుదగ్గరే ఆగిపోయి ఏడుస్తున్న తల్లి వంక నిస్సహాయంగా చూస్తూ నిలబడిపోయారు!

నేలమీద పడివున్న భార్య లేవలేక మూలుగుతోంది!

ఇంతలో అయిదునిమిషాలు గడవకుండానే మరోగ్లాసు ద్రవం భర్త పెదాల మధ్య ఇంకిపోయింది.

ఆ గదిలో ఒకమూలగా నిలబడి ఈ పరిస్థితినిచూస్తున్న ఆమె తృప్తిగా ఊపిరి పీల్చుకుంది.

ఆమె గుండెనిండా ఆనందం పొంగింది!

ఇంక ఈ యింటిలోవుండి వ్యక్తుల్ని పీడించాల్సిన అవసరం ఆమెకు కనిపించలేదు!

సీసాలో ద్రవం వంక, ఖాళీఅయిపోతున్న గ్లాసువంక మార్చిమార్చిచూసి, తృప్తిగా నిట్టూర్చి, రివ్వున బయటకు ఎగిరి వెళ్ళిపోయింది ఆమె!!!